ప్రజా దర్బార్ సమస్యలను వారంలోపే పరిష్కరించాలి

అధికారులకు కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశాలు

సిటీబ్యూరో, జూన్ 24(నమస్తే తెలంగాణ): ప్రజా దర్బార్, ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజావాణిలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి 76 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ప్రజా ప్రతినిధులు, ప్రజా దర్బార్, ఇతర అంశాలపై సమర్పించే దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలన్నారు. కలెక్టరేట్‌లో చెత్త, చెదారం లేకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా నిర్వహణ బాగుండాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో 76 ఆర్జీలు రాగా, ఇందులో గృహ నిర్మాణ శాఖకు సంబంధించిన 28, హైదరాబాద్ ఆర్డీవోకు 9, సికింద్రాబాద్ ఆర్డీవోకు 6, జిల్లా సంక్షేమ అధికారి 3, డీఈవో 2, ఇతర 28 శాఖలకు చెందిన ఆర్జీలు వచ్చాయన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకటాచారి, ఆర్డీవో మహిపాల్ దశరథ్ సింగ్, జిల్లా అధికారులు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

డేంజర్.. యమడేంజర్

అల్మాస్‌గూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో కరంటు వైర్లతో విద్యార్థుల విద్య ముడి వేసుకుంది. దినదినం గండం నూరేళ్ల ఆయుష్షు లాగా విద్యార్థుల భవితవ్యం పెనవేసుకుంది. పాఠశాలలు ప్రారంభం కాక ముందే అన్ని ప్రభుత్వ పాఠశాలలను పరిశీలించి అమ్మ ఆదర్శ పాఠశాలల కింద రిపేర్ చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అల్మాస్‌గూడ ప్రభుత్వ పాఠశాలలో మాత్రం ఇందుకు విరుద్ధంగా ఉంది. విద్యుత్ వైర్లు, మీటర్లు, ఫీజులు, విద్యుత్ బాక్స్‌లు నేలపైనే విద్యార్థులకు అందుబాటులో ఉన్నాయి. పలుమార్లు స్థానికులు అధికారులకు, ఉపాధ్యాయులకు, స్థానిక కార్పొరేటర్లకు చెప్పిన్నప్పటికీ ఎవరు దృష్టి సారించకపోవడంతో పరిస్థితి ఇలా తయారైంది. ఇవే కాక పాఠశాలలో అనేక సమస్యలు తాండవం చేస్తున్నాయి. విద్యార్థులు అడుకుంటూ పోయి విద్యుత్ వైర్లకు తగిలితే పరిస్థితి.. డేంజరే కదా! విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది జరగక ముందే విద్యుత్ వైర్ల సమస్యను అధికారులు పట్టించుకోవాలి. విద్యార్థులకు ఏదైనా జరగక ముందే భద్రతా చేపట్టాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

– బడంగ్‌పేట, జూన్ 24;

విపత్తు వేళ.. పెద్దన్నలా సేవ

ప్రాణాలను లెక్క చేయకుండా స్పందిస్తూ..

పౌరులకు మేం ఉన్నామంటూ భరోసా ఇస్తున్న డీఆర్ఎఫ్

ప్రజల రక్షణగా ప్రపంచ స్థాయి ప్రమాణాలతో విపత్తు సేవలందించిన కేసీఆర్ సర్కారు

2018 నుంచి నేటికి చెక్కు చెదరకుండా పౌరులకు అందుతున్న విపత్కర సేవలు

సిటీబ్యూరో, జూన్ 24(నమస్తే తెలంగాణ): విపత్తు ఎలాంటిదైనా సరే.. మేం ఉన్నాం.. అంటూ హైదరాబాద్ పౌరులకు భరోసా ఇస్తోంది జీహెచ్ఎంసీ విపత్తు స్పందన దళం (డీఆర్ఎఫ్). జీహెచ్ఎంసీలో భాగమైన ఈవీడీఎం (ఎన్‌ఫోర్స్‌మెంట్, విజిలెన్స్, డిజాస్టర్, మేనేజ్‌మెంట్) కింద 2018వ సంవత్సరంలో ఏర్పాటైంది. పౌరులకు మెరుగైన సేవలందించేందుకు గాను బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సీఎం కేసీఆర్ మార్గదర్శకత్వంలో మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ ఈవీడీఎం విభాగాన్ని నగర ప్రజలకు పరిచయం చేశారు. విపత్తు సమయాల్లో అద్భుత ప్రదర్శనతో ముందుండి ఎన్‌ఫోర్స్‌మెంట్, విజిలెన్స్ అండ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ (ఈవీడీఎం) విభాగం పౌరుల మన్ననలు పొందింది. డీఆర్ఎఫ్ ఎన్నో సందర్భాల్లో ప్రాణ, ఆస్తి నష్టం తీవ్రతను తగ్గించింది. ప్రధానంగా 2020 అక్టోబరు భారీ వరదల సమయంలోను విపత్తు నివారణ చర్యలు చేపట్టింది. డీఆర్ఎఫ్ సేవలను గత ప్రభుత్వం ఇతర నగరాల్లోని మున్సిపాలిటీల్లో, ప్రధాన పట్టణాల్లోనూ అమలు చేసింది. ఈ నేపథ్యంలోనే డీఆర్ఎఫ్ ఎప్పటికప్పుడు బలోపేతం అవుతూ ప్రపంచ స్థాయి ప్రమాణాలతో పనిచేస్తున్నది. ఈ వర్షాకాలంలో ఎక్కడ, ఎలాంటి ప్రమాదం జరిగినా ముందుగా అక్కడికి చేరుకుని సహాయక చర్యలను వేగవంతం చేసేలా చర్యలు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలోనే 20 బోట్స్‌ను సిద్ధంగా పెట్టుకున్నారు. కుండపోత వర్షాలు కురిసిన లోతట్టు ప్రాంతాల వాసులకు సురక్షితంగా బయటకు తీసుకువచ్చేలా ఈ బోట్స్‌ను వినియోగించనున్నారు. 8 జేసీబీలు, బోట్స్ ఇంజిన్, స్కిడ్ స్టీర్ లోడర్‌ల యంత్రాలను వినియోగించనున్నారు. ప్రధానంగా ఐఎండీ, టీజీడీపీఎస్ , ఇతర ప్రైవేట్ వాతావరణ సంస్థల నుంచి వచ్చిన సమాచారాన్ని పౌరులకు ముందస్తుగా అలర్ట్‌గా చేయడం, అన్ని శాఖల సమన్వయం, ప్రమాద స్థలికి క్షణాల్లో చేరుకుని సహాయక చర్యలు చేపట్టి ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకోవడం లాంటివి చేపడుతున్నారు. మొత్తంగా వర్షం పడక ముందే రోడ్లపై ఉండి, అటు వాహనదారులకు, ఇటు ప్రజలకు అండగా నిలబడుతూ డీఆర్ఎఫ్ పౌరుల మన్ననలు పొందుతున్నది. గత ప్రభుత్వ చొరవతోనే ఈవీడీఎం సేవలు నేటికి సమర్థవంతంగా అందుతున్నాయని ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

డీఆర్ఎఫ్ స్వరూపం

- 30 సర్కిళ్లలో 30 డీఆర్ఎఫ్ బృందాలు
- 22 ట్రక్స్‌లు, 8 ఎల్ఎంవీఎస్ వాహనాలు (సేఫ్టీ పరికరాలు, రెస్క్యూ టూల్స్, డీ-వాటరింగ్ పంప్స్, మోటార్లు, ఫైర్ ఫిట్టింగ్ పరికరాలు వాహనాల్లో ఉంటాయి)
- మూడు కమిషనరేట్ల పరిధిలో అత్యవసర బృందాలు
- హైదరాబాద్‌లో ఏడు, సైబరాబాద్‌లో నాలుగు, రాచకొండలో నాలుగు బృందాలు ఏర్పాటు చేశారు. 10 గ్రీన్ వేస్ట్ బృందాలు అందుబాటులో ఉంటాయి. చెట్లు, కొమ్మలు విరిగిపడినప్పుడు వెంటనే సంబంధిత ప్రాంతానికి చేరుకుని వాటిని తొలగించడం, వ్యర్థాలను తరలించడం, ట్రాఫిక్ క్లియర్ చేయడం ఈ బృందాల పని
- ఉన్నతాధికారుల నిరంతర పర్యవేక్షణలో నాలుగుజీ ఎల్‌టీఈ ఆధారిత వాకీ టాకీ వైర్‌లెస్
- ట్యాంక్‌బండ్ బుద్ధభవన్‌లో డీఆర్ఎఫ్ కార్యాలయంలో 24X7 నిరంతర పర్యవేక్షణ, సిటీజన్స్‌కు ఫోన్ నం. 040-2955 5500, 90001 13667లలో 24 గంటల పాటు అందుబాటులో ఉంటారు.
- హెచ్‌పీ డీ వాటరింగ్ పంపులు 22,6.5 హెచ్‌పీ పంపులు 11, 8 హెచ్‌పీ పంపులు 3, 10హెచ్‌పీ 1, 20 హెచ్‌పీ 1, 7.5 కేవీఏ జనరేటర్, 5 కేవీఏ సైలెంట్ జనరేటర్.

సమస్యలను సమర్థవంతంగా..

- ఎన్.ప్రకాష్‌రెడ్డి, డైరెక్టర్, ఈవీడీఎం

ఈ వర్షాకాల సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాం. గత అనుభవాలను పరిగణనలోకి తీసుకుని ఈ ఏడాది ప్రజలకు ఎలాంటి ముంపు సమస్య లేకుండా చేయడమే లక్ష్యంగా ముఖ్యమైన ప్రాంతాల్లో డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (డీఆర్ఎఫ్) బృందాలు రంగంలోకి దింపాం. ముంపు సమస్యలు నివారించేందుకు, బాధితులకు రక్షించేందుకు సుశిక్షితులైన సిబ్బందితో ఈవీడీఎం సిద్ధంగా ఉంది. వచ్చే అక్టోబరు నెలాఖరు వరకు ఒక్కో సర్కిల్‌కు ఓ డీఆర్ఎఫ్ బృందాన్ని నియమించాం. గ్రేటర్ వ్యాప్తంగా పడవలు, రక్షణ సామగ్రితో అన్ని వేళలా డీఆర్ఎఫ్ బృందాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నాం. ప్రత్యేకంగా కంట్రోల్ రూం నిరంతరం ప్రజలకు సేవలందిస్తాం. జనరేటర్, అగ్ని ప్రమాదాలను ఎదుర్కొనే పరికరాలు, ఇతరత్రా రక్షణ వస్తువులు డీఆర్ఎఫ్ బృందాలు కేటాయించిన ప్రాంతాల్లో ఉంటూ రక్షణ చర్యలు చేపడతారు.

ట్రాఫిక్ నియంత్రణకు ఎన్ఎస్ఎస్

జూబ్లీహిల్స్, జూన్24: నగరంలో రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియంత్రణలో 30 వేల మంది ఎన్ఎస్ఎస్ వలంటీర్ల సేవలు వినియోగించుకోనున్నారు. ఈ మేరకు గోషామహల్‌లోని ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్‌లో సోమవారం 300 మంది ఎన్ఎస్ఎ స్ వలంటీర్లకు ఇచ్చే శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం డీజీపీ రవి గుప్తా, విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం, నగర కమిషనర్ కె.శ్రీనివాస రెడ్డితో కలిసి ప్రారంభించారు.

ఐదోసారి జాతీయ చాంప్‌నకు మణి శంకర్

హైదరాబాద్, ఆట ప్రతినిధి, జూన్ 24: జాతీయ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌ల్లో హైదరాబాద్ జిల్లాకు చెందిన ప్రగతి మహా విద్యాలయ కళాశాల విద్యార్థి కె.మణి శంకర్ ఐదోసారి జాతీయ చాంపియన్‌షిప్‌లకు ఎంపికయ్యాడు. నాలుగు గోల్డ్ మిడిల్ సాధించిన శంకర్ ఈ నెల 28వ తేదీ నుంచి తమిళనాడులోని సేలం జరగనున్న జాతీయ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ క్రీడాకారుడు ప్రాతినిధ్యం వహించనున్నారు. అంతకు ముందు జరిగిన అఖిల భారత అంతర్ యూనివర్సిటీ రెజ్లింగ్ చాంపియన్‌షిప్-2023, 2024లో ఉస్మానియా విశ్వవిద్యాలయం విద్యార్థిగా పసిడి పతకాలను గెలుచుకున్నారు. రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఆధ్వర్యంలో 2023, 2024లో జాతీయ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో 80 కేజీల విభాగంలో స్వర్ణాలతో చాంపియన్‌గా నిలిచాడు.

పాస్‌పోర్ట్ సేవా దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం సికింద్రాబాద్‌లోని పాస్‌పోర్ట్ కార్యాలయంలో ఉద్యోగులు కేక్ కట్‌చేసి వేడుకలు జరుపుకున్నారు. పారదర్శక, సమర్థవంతమైన పాస్‌పోర్ట్ సేవలు, మెరుగైన పౌర సేవలు అందించేందుకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.

– జూబ్లీహిల్స్, జూన్ 24

లంబాడీలకు మంత్రి పదవి ఇవ్వాలి

పోస్టర్లను విడుదల చేస్తున్న గణేశ్ నాయక్, వెంకట్ బంజారా, శ్రీనివాస్ నాయక్ తదితరులు

ఖైరతాబాద్, జూన్ 24: రాష్ట్ర మంత్రివర్గ విస్తరణలో లంబాడీలకు మంత్రి పదవి ఇవ్వాలని లంబాడి హక్కుల పోరాట సమితి ఎల్ హెచ్‌పీఎస్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు ధరావత్ గణేశ్ నాయక్ అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఆర్నెళ్లు గడిచినా, ఇప్పటి వరకు గిరిజన సంక్షేమ శాఖకు సంబంధించిన మంత్రిని నియమించలేదన్నారు. గిరిజన సంక్షేమ హాస్టళ్ల పరిస్థితి దయనీయంగా ఉందని, ఇప్పటి వరకు ఆయా హాస్టళ్ల మెస్ బిల్లులు విడుదల చేయలేదని, వార్డెన్లు బయట నుంచి అప్పులు తెచ్చుకొని విద్యార్థుల సౌకర్యాలు తీరుస్తున్నారని, నేడు వాటిని తిరిగి చెల్లించలేని పరిస్థితుల్లో ఉన్నారన్నారు. బెల్లయ్య నాయక్ సంఘానికి, తమ సంఘానికి ఎలాంటి సంబంధం లేదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి 24 గంటల్లో గిరిజనులకు మంత్రి పదవి ఇస్తున్నట్లు ప్రకటించాలని, లేని పక్షంలో ఈ నెల 28న సీఎం ఇంటి ముందు నిరసన ధర్నా చేస్తామని హెచ్చరించారు.

మధ్యాహ్న భోజనానికి బడ్జెట్ కేటాయించాలి

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న సీఐటీయూ నేతలు, మధ్యాహ్న భోజన కార్మికులు

మేడ్చల్ కలెక్టరేట్ వద్ద సీఐటీయూ ధర్నా

మేడ్చల్ కలెక్టరేట్, జూన్ 24: మధ్యాహ్న భోజనానికి బడ్జెట్ కేటాయించాలని, భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ రాష్ట్ర నాయకుడు నర్సింగ్‌రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ వద్ద సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్‌లో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా మధ్యాహ్న భోజన కార్మికులకు ఇచ్చే గౌరవ వేతనం, విద్యార్థులకు ఇచ్చే మెనూ చార్జీలు పెండింగ్‌లో ఉన్నాయని, నెలల తరబడి బిల్లులు రాకపోవడంతో వారు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలో భాగంగా మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.10 వేల వేతనం అమలు చేయాలని, గుర్తింపు ఇవ్వాలన్నారు.

– మేడ్చల్-మల్కాజిగిరి కలెక్టరేట్ వద్ద ధర్నా చౌక్ ఏర్పాటు చేయాలని సీఐటీయూ కోశాధికారి ఉన్నికృష్ణ, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు.

మొక్కుబడిగా ప్రజావాణి

మేయర్, డిప్యూటీ మేయర్, కమిషనర్ లేకుండానే సాగిన కార్యక్రమం

సిటీబ్యూరో, జూన్ 24(నమస్తే తెలంగాణ): ప్రజావాణి... ప్రజా సమస్యల పరిష్కారం కోసం జీహెచ్ఎంసీలో ప్రతి సోమవారం నిర్వహించే విశిష్ట కార్యక్రమం. కానీ జీహెచ్ఎంసీలో ప్రజా వేదన వినేవారే కరువయ్యారు. అపరిష్కృత సమస్యకు పరిష్కారం దొరుకుతుందని ఎంతో ఆశతో సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారులకు ప్రజావాణిలోనూ చేదు అనుభవమే మిగులుతోంది. కేవలం మొక్కుబడిగా ప్రజావాణిని నిర్వహిస్తూ మమ అనిపిస్తున్నారు. వాస్తవానికి ప్రజావాణికి మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలత, కమిషనర్‌తో పాటు ఆయా విభాగాల ఉన్నతాధికారులు హాజరై ప్రజల ఫిర్యాదులను స్వయంగా స్వీకరించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి. అయితే, సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో వారు లేకుండానే కార్యక్రమం నిర్వహించారు. దీంతో ఉన్నతాధికారులు మొక్కుబడిగా ప్రజావాణిని ముగించారు. గత సోమవారం బక్రీద్ కారణం గా నిలిచిపోవడం, 15 రోజుల తర్వాత నిర్వహించిన కార్యక్రమం కావడంలో పెద్ద సంఖ్య లో అర్జీదారులు ప్రధాన కార్యాలయానికి పోటెత్తారు. కాన్ఫరెన్స్ హాలులో అర్జిదారులతో కిక్కిరిసిపోవడం, చివరకు ఆ ప్రాంగణం సరిపోకపోగా బయట ఫిర్యాదుదారులు గంటల తరబడి కూర్చొని చివరకు ప్రజావాణిలో ఉన్న అధికారులను కలుసుకుని ఫిర్యాదు చేసి వెళ్లారు. కొందరైతే కమిషనర్, మేయర్ లేకపోతే ఉన్న అధికారులు ఏం చేస్తారులే అని, ప్రజా పాలనలో ప్రజా వేదన వినేవారే కరువయ్యారంటూ అర్జీదారులు వెనుతిరిగి పోవడం గమనార్హం. ఇప్పటికే సమస్యలకు ఉన్నతాధికారులకే కారణమని, అక్రమ కట్టడాలు, కబ్జాలకు ప్రోత్సహిస్తున్నారని, ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని గతంలో మేయర్, కమిషనర్ ముందు ఉప్పల్, గచ్చిబౌలి వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. అపరిష్కృత సమస్యను పరిష్కరించకుంటే ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్య చేసుకుంటానని సైతం ఉప్పల్ నుంచి వచ్చిన ఫిర్యాదు దారుడు హెచ్చరించిన పరిస్థితి. ప్రజా సమస్యల పరిష్కారంలో చిత్తశుద్ధిగా వ్యవహరించాల్సిన ప్రజావాణిని తూతూ మంత్రంగా నిర్వహిస్తుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

వెల్లువలా ఫిర్యాదులు..

ప్రజావాణికి ప్రజల నుంచి ఫిర్యాదులు వెల్లువలా వచ్చాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను అధికారులకు విన్నవించారు. అడిషనల్ కమిషనర్లు కే.శ్రీనివాస్, సత్యనారాయణ, ఉపేందర్ రెడ్డి, నళి పద్మావతి, చంద్రకాంత్ రెడ్డి, సీసీపీ రాజేంద్ర ప్రసాద్ నాయక్, అడిషనల్ సీసీపీ గంగాధర్ ప్రజల నుంచి విన్నపాలు స్వీకరించారు. హౌజింగ్‌కు సంబంధించి 53 , టౌన్ ప్లానింగ్ 42, ఇంజినీరింగ్ 15, తదితర వాటికి కలిపి మొత్తం 137 ఫిర్యాదులు వచ్చాయి. ఫోన్ ఇన్ కార్యక్రమం ద్వారా 15 విన్నపాలను స్వీకరించారు. టౌన్‌ప్లానింగ్, రేషన్‌కార్డు, జీహెచ్ఎంసీకి సంబంధించినవే కాకుండా ఇతర శాఖలకు సంబంధించిన వాటిని తీసుకొని ఆయా శాఖలకు పంపించారు. ప్రజావాణి కార్యక్రమంలో చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పద్మజ, చీఫ్ ఎంటమాలజీ డాక్టర్ రాంబాబు, హౌసింగ్ ఎస్ఈ విద్యాసాగర్, డిప్యూటీ సీఈ కేఎస్ రెడ్డి, కంట్రోల్ రూం ఓఎస్డీ అనురాధ పాల్గొన్నారు. కాగా, జోనల్ కార్యాలయాల్లోనూ ప్రజావాణిని మొక్కుబడిగా ముగించడం గమనార్హం.

మేయర్ ఎక్కడ ?

గ్రేటర్‌లో కోటి మందికి పైగా పౌర సేవలందించే బల్దియాకు మేయర్‌గా గద్వాల్ విజయలక్ష్మి కొనసాగుతున్నారు. నగరాభివృద్ధి ముఖ్య భూమిక పోషించడం, మౌలిక వసతుల కల్పన, ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వారి కష్టాల్లో అండగా నిలవాల్సిన మేయర్.. భరోసా కల్పించడంలో విఫలం చెందుతున్నారు. ఎక్కువ శాతం తోటి కార్పొరేటర్లకు కానీ, ఇటు ప్రజలకు దూరంగా ఉంటూ వస్తున్నారు. సీఎస్ఆర్ నిధుల సమీకరణ, సిస్టర్ సిటీ ఒప్పందాలపై సమీక్షలు ఆశించిన స్థాయిలో ఉండటం లేదు. అన్నింటి కంటే ఏదైన ఘటన జరిగినప్పుడు వెంటనే ఘటన స్థలికి వెళ్లకపోవడం విమర్శలకు తావిస్తోంది. అసలే వర్షాకాలం..ఇటీవల గోడకూలి చనిపోయిన ఘటనలో బాధిత కుటుంబాలను కలిసి వారికి భరోసా కల్పించలేకపోయారన్న అపవాదు ఉంది. శానిటేషన్‌పై ఆకస్మిక పర్యటనలు కానీ, కనీసం సమీక్షలు జరపడం కానీ మేయర్ చేయడం లేదు. చివరకు ప్రజలు ఎంతో ఆశతో మేయర్‌ను కలిసి అధికారుల అవినీతిపై ఫిర్యాదు చేద్దామని ప్రజావాణి కార్యక్రమానికి వచ్చే ఫిర్యాదుదారులకు నిరాశే ఎదురవుతుంది. డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత పనితీరు పట్ల విమర్శలు లేకపోలేదు.

ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నిరుద్యోగులు

గ్రూప్-2, 3 పోస్టులు పెంచి పరీక్షలు నిర్వహించాలి

ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 24: రాష్ట్రంలో గ్రూప్-2, గ్రూప్-3 పోస్టుల సంఖ్యను పెంచి డిసెంబర్‌లో డీఎస్సీతో పాటు పరీక్షలను నిర్వహించాలని దక్షిణ భారత రాజకీయ జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్ డిమాండ్ చేశారు. గతేడాది అక్టోబర్ 1న సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిరుద్యోగులు ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొని నిరుద్యోగుల డిమాండ్లు నెరవేరుస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. నిరుద్యోగుల డిమాండ్లపై కొంతమంది ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం, ఆయన మాట్లాడుతూ, గ్రూప్-2, గ్రూప్-3 పోస్టుల సంఖ్యను పెంచడంతో పాటు అన్ని పరీక్షలు అందరు రాసే విధంగా వెసులుబాటు కల్పిస్తామని చెప్పారన్నారు. పరీక్షల మధ్య స్పష్టమైన గడువు ఉండేలా జాబ్ క్యాలెండర్ రూపొందిస్తామని హామీ ఇచ్చారని చెప్పారు. అలా నిరుద్యోగులకు ఇచ్చిన హామీల ద్వారానే రేవంత్ గద్దెను ఎక్కగలిగారని అభిప్రాయపడ్డారు. ఆ హామీలను అమలు చేయాల్సిన బాధ్యత రేవంత్‌పైనే ఉందన్నారు. కార్యక్రమంలో నిరుద్యోగులు జనార్ధన్, ఇంద్ర ప్రసాద్ నాయక్, చంద్రశేఖర్, యుగంధర్, మహేశ్ కుమార్, చంద్ర కుమార్ పాల్గొన్నారు.

విద్యాశాఖకు నిబంధనలు పట్టవా..?

మేడ్చల్, జూన్ 24(నమస్తే తెలంగాణ): విద్యాశాఖ నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలకు విచ్చలవిడిగా పర్మిషన్లు ఇస్తున్న మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా విద్యాధికారి విజయకుమారిపై విచారణ జరిపి, సస్పెండ్ చేయాలని ఏఐవైఎఫ్ డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భం గా ఏఐవైఎఫ్ నాయకులు మాట్లాడుతూ.. 2024-25 విద్యా సంవత్సరానికి గాను కార్పొరేట్ పాఠశాలలు నిబంధనలకు విరుద్ధం గా మేడ్చల్ జిల్లా వ్యాప్తంగా పుట్టుకొచ్చాయని అన్నారు. అనుమతిలేని పాఠశాలలను తనిఖీ కూడా చేయడంలేదని ఆరోపించారు. కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో ముద్రించిన నోట్ బుక్స్, యూనిఫామ్స్, స్టేషనరి వంటివాటిని విక్రయించవద్దని డీఈవోకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డికి ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూర్ ధర్మేంద్ర, జిల్లా కార్యదర్శి సత్య ప్రసాద్‌లు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు గిరిబాబు, కిరణ్, అజీమ్‌పాషా, హస్మత్, తదితరులు పాల్గొన్నారు.

అనీస్ ఉల్ గర్బాకు చిన్నారుల తరలింపు

సిటీబ్యూరో, జూన్ 24(నమస్తే తెలంగాణ) : నాంపల్లిలోని అనీస్ ఉల్ గర్బా భవనానికి 19మంది అనాథ మైనార్టీ చిన్నారులను తరలించినట్లుగా మైనార్టీ రెసిడెన్షియల్ ఇనిస్టిట్యూషన్స్ సొసైటీ సెక్రటరీ అయేషా మిసరత్ ఖానం సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పిల్లలకు అవసరమైన విద్య, వసతి సదుపాయాలన్నీ మోంటీసోరీ పాఠశాలలో 4వ తరగతి వరకు, ఆ తర్వాత మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలల్లో చేర్పిస్తామని తెలిపారు. ఇందులో ఇద్దరు బాలురు, 17 మంది బాలికలు ఉండగా... వీరికి ఇద్దరి ఆయాలు, ముగ్గురు హౌజ్ కీపింగ్, ఇద్దరు వంట మనషులతోపాటు, మాంటీసోరి ఉపాధ్యాయులు వీరిని సంరక్షిస్తారని తెలిపారు.

కార్మిక వ్యతిరేక కోడ్స్‌ను అమలు చేయొద్దు

ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఐ.కృష్ణ

చిక్కడపల్లి, జూన్ 24: కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్స్ కోడ్స్‌ను అమలు చేయబోమని అసెంబ్లీలో తీర్మానం చేయాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర అధ్యక్షుడు ఐ.కృష్ణ డిమాండ్ చేశారు. ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో సోమవారం నాలుగు లేబర్ కోడ్స్‌లకు వ్యతిరేకంగా ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని కార్మిఖ శాఖ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అదే విధంగా కార్మిక శాఖ అదనపు కమిషనర్‌కు గంగాధర్‌కు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భగా కృష్ణ మాట్లాడుతూ, మోదీ ప్రభుత్వం మూడోసారి అధికారం చేపట్టిన తర్వాత కార్మిక వ్యతిరేక విధానాలను మరింత వేగవంతం చేసిందన్నారు. మూడోసారి అధికారం చేపట్టిన మొదటి మీటిగ్‌లోనే గతంలో అక్రమంగా తీసుకొచ్చిన లేబర్ కోడ్స్‌ను అమలకు పూనుకుందని మండిపడ్డారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్ష, ప్రధాన కార్యుదర్శులు అరుణ, మల్లన్న, మనమ్మ, మంగ్ల, సత్యనారాయణ, కుమార్, సరోజ, లీల, మంజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం

శంషాబాద్ రూరల్, జూన్ 24 : కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా.. బీజేవైఎం నాయకులపై దాడులకు నిరసనగా సోమవారం శంషాబాద్ పట్టణంలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా.. సమస్యలపై ప్రశ్నించే బీజేవైఎం నాయకులపై దాడులు చేయిస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని.. లేనిచో పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని ఆయన హెచ్చరించారు.

చెంచు మహిళకు అండగా నిలుస్తాం

రాష్ట్ర ఉప ముఖ్యమంతి భట్టి విక్రమార్క నిమ్స్‌లో చికిత్స పొందుతున్న చెంచు మహిళను, ఆమె కుటుంబ సభ్యులను